సన్నిధి

"ఆమె పోయిందిట..."

"అవును... విన్నాను..."

కుతూహలంగా చూస్తున్నాడు వాసు రామకృష్ణను.

"టీ తాగు వాసూ! చల్లారిపోతుంది..." ఒక్క క్షణం ఆగి అన్నాడు.

"మరి నువ్వెళ్లవా?" టీ సిప్ చేస్తూ అడిగాడి వాసు. మాట్లాడలేదు రామకృష్ణ... చేతులు కట్టుకుని, కిటికీలోంచి ధారగా పడుతున్న వర్షాన్ని చూస్తున్నాడు. ఆకుపచ్చటి క్రోటన్స్ తబ్బిబ్బు అవుతున్నాయి... ఈదురు గాలి...

"మాట్లాడవేం?"

ఏమి సమాధానం చెపుతాడు?! నువ్వెవరు? అని అడగకపోవచ్చు జనం... కానీ, కొన్ని ప్రశ్నలు అడగఖర్లేదు. అర్థమైపోతాయి.

"వెళ్లను... రా పోదాం..." రెస్టారెంటులో బిల్లు ఇస్తూ అన్నాడు.

"నువ్వు మనిషివి కావురా?!"

కార్లో అన్నాడు వాసు బాధగా.

నవ్వేశాడు రామకృష్ణ.

"కానేమో... మా ఇంటికి పోదాం పద."

* * *

ఇంటికి వచ్చి తల తుడుచుకుంటూ, భార్యతో కబుర్లు చెపుతూ, వేడివేడి భోజనం తింటూ... ఇదంతా రొటీను...

కానీ, "ఆమె"ను గురించే ఆలోచిస్తున్నాడు వాసు, రామకృష్ణను చూస్తూ...

అలా "నేను వెళ్లను..." అని ఎలా అనగలిగాడు?!

"నీ స్నేహితుడు ఒట్టి రాయి అని వదిలేద్దామా? అంటే అదీ కాదు... చంద్రశిలా ఫలకం... కరిగితే వెన్నెలే... కానీ ఎంతమందికి తెలుసు ఆ విషయం?!"

ఈ మాటలు "ఆమె"వి.

రామకృష్ణ, వాసు స్కూలు రోజుల నుంచీ స్నేహితులు. వారి స్నేహం అలా పెద్దవాళ్లైనా నిలబడడానికి కారణం కొంత అనుకూలమైన సన్నిహితత్వమేమో...

పట్నంలో చదువుకునేవారు ఇద్దరూ...

ఏమీకారు... బంధుత్వరీత్యా...

కృష్ణాజిల్లా అజ్జంపూడి లాంటి పల్లెటూరులో కాలవ నుంచి ఇల్లాళ్ళు నీరు తెచ్చుకునేవారు. కృష్ణానది పాయ అక్కడ ఎఱ్ఱ పూవుల చెట్ల నీడన మెత్తటి ఇసుకలో చాలా అద్భుతంగా ఉండేది.

అమ్మలకొంగు పట్టుకుని ఏటి ఒడ్డుకు షికారుకు వచ్చే వాళ్ళిద్దరూ... వారి ఇద్దరి ఇళ్ళు ఎదురు గడపలే...

కోడిపుంజు పూలతో పందాలు వేసుకుని చచ్చేట్లు కొట్టుకునేవారు. ఆమె అప్పటికి ఏడు ఎనిమిది ఏళ్ల పిల్లేమో... నిర్మొహమాటంగా గడ్డరితనం చేసి, అయినా, గెలిచానని జలపాలు, జీళ్లు లాక్కునేది.

ఓడిపోవాలనే ఓడిపోయేవాడు రామకృష్ణ.

"ఆ గుణం జీవితాంతం మిగిలిపోయింది నీ స్నేహితుడికి... కానీ, ఎప్పుడూ ఎదుటివాళ్లు అది వాళ్ల గెలుపు అనుకుంటారు పాపం..." ఎప్పుడో మాటల సందర్భంలో చెప్పింది ఆమె.

ఆవార, ఆపాప లక్కపిడతలలో వేరుసెనగపప్పు, ఖర్జూరాలు, చేగోడీలు ఉల్లిపాయలు... ఇవన్నీ కలిపి అన్నాలాట ఆడేది... వండి వడ్డించడం, మహా ఇష్టం ఆ పిల్లకి అందుకనే, అన్నీ బాదం ఆకులో పెట్టి "తినూ..." అని పట్టు గాజులతో బొద్దుగా ఉన్న చేతులతో పరికిణీ బొందికగా పెట్టుకుని కూర్చుని బెదిరించి తినిపించేది.

అందుకే, "అప్పుడు ఓడిపోయినా నాకేం బాధ ఉండేది కాదు... కాని ప్రపంచం అలా కాదే... దానికి మన దగ్గర నుంచి అన్నీ లాక్కోవడం వచ్చు... అంతే... మనకేం కావాలో దానికి అక్కర్లేదు..." అనేవాడు రామకృష్ణ.

వాళ్లది అందమైన, నిర్మలమైన స్నేహం... స్నేహితులిద్దరూ హైస్కూల్ దాటేప్పటికే ఆ పిల్ల పెళ్లై అత్తగారింటికి వెళ్లిపోయింది.

ఆ తరవాత మూడేళ్లకు మళ్ళీ రామకృష్ణ చెల్లెలు పెళ్లికి, మగపెళ్ళి వారి తరపున కనబడింది ఆమె. ఎదుగుతూ రామకృష్ణ చాలా లౌక్యాలు నేర్చుకున్నాడు. కావలసినవి సంపాదించుకోవడం లేదా కొనుక్కోవడం నేర్చుకున్నాడు. వాసు తనకేం కావాలో తెలిసినా, ఎలా పొందాలో తెలియక మామూలు జీవితంతో ఆగిపోయాడు.

కానీ, ఆమె... ఆమె తమాషాగా అలాగే ఉండిపోయింది. అసలు ఆడపిల్లలు మహా ఆరిందాలై, ఊసరవెల్లి లక్షణాలన్నీ అలవరుచుకుంటారు పెద్దవాళ్ళై... కానీ, ఆ అమ్మాయి ఏమిటి?! మారదా?! అదే నిర్మలమైన నవ్వు. అదే నిశ్చలమైన చూపు...

ఇది స్నేహితులిద్దరికీ ఆశ్చర్యమని అనిపించింది. చాలా మామూలుగా మాట్లాడింది ఆమె... మూడేళ్ల తరవాత చూసిన మగపిల్లలు ఎలా మాట్లాడాలా అని భయపడ్డారు కానీ, అంత కాలాన్ని ఆమె గుర్తు పట్టడానికి సిద్ధపడలేదు.

కలిసినది కొద్దిసేపే... బోలెడన్ని కబుర్లు చెప్పుకున్నారు. పిల్లలు లేరట

"ఇంక పుట్టరని డాక్టరు భయపెడితే, మావారికి మరో పెళ్లి చేస్తామని మా అత్తగారు భయపెడుతున్నారు..." నవ్వుతూనే చెప్పింది ఆమె.

కానీ... ఆ మాటలు విని వాసు ఉలిక్కిపడ్డాడు, రామకృష్ణ మొహం చూసి.

ఆమె భర్త మరో పల్లెటూళ్లో శానిటరీ ఇన్స్‌పెక్టర్.

ఆ రాత్రంతా నిద్రపోలేదు రామకృష్ణ.

"అదేమిట్రా... ఆవిడను... అలా ఎలా... చూస్తో... అయినా ఆ మొగుడు..." అంటూ మాట్లాడుతూనే ఉన్నాడు.

కొన్ని ప్రశ్నలకు సమాధానాలు ఉండవు... వెతుక్కోవాలి. వెతికాడు రామకృష్ణ, ఆమె ఊళ్లో వుండే చుట్టం ద్వారా.

"ఆవిడ సుఖంగా లేదురా... చాలా బాధల్లో ఉన్నది. వాళ్లాయన పెద్ద గ్రంథసాంగుడు..." బాధగా అన్నాడు వాసుతో.

ఏం చెయ్యడం?! చాలా మంది జీవితాల్లోని మామూలు కథే ఇది.

"కానీ... కానీ... ఆవిడకు మామూలు మనిషిలా ఈ చవకబారు కష్టాలేమిట్రా?!"

అతడి మాటలకు నవ్వొచ్చింది వాసుకు... కానీ, నవ్వలేకపోయాడు.

❀ ❀ ❀

రామకృష్ణ, క్లాసుమేటు జానకి ప్రేమలో తలమునకలుగా పడ్డాడు.

"ఆమె మన ఊరొచ్చిందిట... ఏదో వైద్యం కోసం. రెండు నెలలు ఉంటుందిట... జానకి సంగతి చెప్పాలి..." అన్నాడు రామకృష్ణ.

ఇద్దరు స్నేహితులు ఊరు వెళ్లారు.

ఆ వరండాలో కుర్చీల్లో కూర్చున్నారిద్దరూ... పెద్ద గడపకు ఆనుకుని కింద కూర్చుంది ఆమె. పొడుగాటి స్టీలు గ్లాసుల్లో మసాలా మజ్జిగ ఇచ్చింది వాళ్ల అమ్మ.

మెల్లిగా జానకి గురించి చెప్పాడు రామకృష్ణ.

"ఈ మధ్య మనవాడికి ఆ పేరు తప్ప కలవరింతలు మరేం లేవు!" వాసు వెక్కిరింపుగా అన్నాడు. రామకృష్ణ నవ్వుతూ సమాధానం చెప్పాడు.

నవ్వేసింది ఆమె... చాలాసేపు వాళ్లను మాట్లాడనిచ్చి...

"నువ్వేమిటో ఆ పిల్లకు తెలుసా?! ఆ పిల్లను నువ్వు నిజంగా కావాలనుకుంటున్నావా? ఆ పిల్ల ఏమిటో తెలిసే కావాలనుకుంటున్నావా?!" సూటిగా చూస్తూ అడిగింది.

అరచేతిని, వేళ్లను చూసుకుంటూ మాట్లాడలేదు రామకృష్ణ

"గోడమీద వేళ్లాడేసుకోవడానికి ఒక నలభై సంవత్సరాలకు సరిపడ క్యాలండరు కొనుక్కున్నట్లు కాదు పెళ్లంటే. ఆలోచించుకో... ఆ పిల్లకు ఏం కావాలో తెలుసుకో... నువ్వు అది ఇవ్వగలవా? అని ఆలోచించుకో... అసలు ముందు నీ

సంగతి ఏమిటి?! నీకేమిటి కావాలి?!" మెల్లిగా చీకట్లో మెరుస్తున్న నందివర్ధనం పూలవంక చూస్తూ చెప్పింది.

ఆ పాతకాలపు బరువైన గుమ్మానికి ఆనుకుని కూర్చున్న ఆమె చాలా చిన్నగా అనిపిస్తోంది.

కానీ, ఆ రూపంలో ఏదో ఎక్కువతనం.

ఆమె ఉన్నచోట, ఆమె తప్ప మరేం కనిపించదు చుట్టుపక్కల, అనిపించింది రామకృష్ణకు.

కాసేపటి తరవాత బయలుదేరుతూ,

"నీ కళ్లకింద ఎందుకలా ఉబ్బింది?! ఒంట్లో బాగా లేదా?!" అన్నాడు రామకృష్ణ

నవ్వేసింది ఆమె.

"ఏదో సంజుకు సంబంధించిన వ్యాధి... బలుపో, వాపో తెలియడం లేదు..."

వెనక్కు వెనక్కు చూసుకుంటూ వచ్చేశాడు రామకృష్ణ.

❀ ❀ ❀

ఆలోచించుకుంటూ కూర్చుంటే చాలా పెళ్ళిళ్లు ముడిపడవు. జానకి రామకృష్ణను పెళ్లి చేసుకున్నది. పెళ్లికొడుక్కి వృద్ధిలోకి వచ్చే అవకాశాలు, పెళ్లికూతురి వల్ల ఆర్థికలాభాలూ ఉన్నాయి కాబట్టి ఇటువాళ్లకు, అటువాళ్లకు అభ్యంతరం లేకపోయింది.

గ్రామదేవత పూజచేయించి మనూళ్లోనే గృహప్రవేశం జరగాలని పట్టుపట్టింది రామకృష్ణ తల్లి. ఈ పెళ్లిళ్లు నిలవడానికి ఎన్ని దీవెనలు కావాలో అని పెద్ద వాళ్ల దుడుకు.

ఆమెకు అబార్షన్ అయిందని పుట్టింట్లో ఉందట.

సత్యనారాయణ వ్రతానికి వచ్చింది.

"మా ఆవిడ..." అంటూ జానకిని పరిచయం చేశాడు ఆమెకు.

"చాలా అందంగా ఉంది..." నవ్వుతూ అన్నది ఆమె.

"ఆవిడెవరు?" సూటిగా ప్రశ్నించింది జానకి.

ఏదో చెప్పబోయాడు... కానీ, ఆగిపోయాడు రామకృష్ణ. ఏమని చెప్పగలడు? పైగా జానకికి ఎలా అర్థమౌతుంది?

భార్యకు చెప్పలేనివి భర్తకు కొన్ని వుంటాయని మూడో రోజునే అర్థమైంది రామకృష్ణకు.

"నేను మీ వారికి చిన్ననాటి స్నేహితురాలిని..." నిష్కల్మషంగా నవ్వుతూ చెప్పింది ఆమె.

"మరి ఇప్పుడు?" ఆ ప్రశ్నలో ధ్వనికి ఉలిక్కిపడ్డాడు. భోషాణం దగ్గర అరటిపళ్ల గెలలు దించుతున్న వాసు.

"ఇప్పుడూ మాకు స్నేహితురాలే..." ఖంగారుగా సర్దేసి చుట్టూ చూశాడు రామకృష్ణ కోసం. అతడు అక్కడ లేడు.

ఆ తరవాత... జానకి, రామకృష్ణ పడకటింట్లో, వంటింట్లో, కార్లో, పిల్లల స్కూలు, ఫంక్షన్‌లో హక్కులున్న పరిచయస్థురాలిగానే మిగిలిపోయింది.

"నేను మీకు అర్థంకాను ఎప్పటికీ..." షిఫాన్ చీర దగ్గర నుంచి, క్లబ్ మెంబర్‌షిప్ దాకా ఒకటే మాట. కొంత సుఖం ఏమిటంటే జానకివి డబ్బుతో తీరే సమస్యలు. రామకృష్ణ దగ్గర అది పుష్కలంగానే ఉన్నది. కొంతమంది ఆడవాళ్లు ఖరీదును బట్టి అలంకారాలతో అందం పెరుగుతుందనుకుంటారు.

కాటుక పెట్టిన కళ్లు, పసుపు రాసిన పాదాలు, బొడ్డు మల్లిపూవులు, మట్టిగాజులు, పసుపుతాడు... ఇవి ఆమె అలంకారాలు... 'వాటికే అందం తెచ్చే "ఆమె" తెలిసిన అతనికి,

లక్ష రూపాయల రవ్వల నగ పెట్టుకుని 'బాగున్నానా?' అని గర్వంగా ప్రశ్నించే భార్యను చూసి నవ్వుతాడు.

కోపం జానకికి...

"నేను మీకు అర్థం కాను..." జానకి ఊతపదం అది.

కానీ,

"నేను నీకు ఎప్పటికీ అర్థం కాను..." అని అనడతను, ప్రయోజనమున్న మాటలే తక్కువ మాట్లాడతాడాయె.

❀ ❀ ❀

"రామకృష్ణా! ఏం చేస్తున్నావురా?" హడావిడిగా వచ్చాడు వాసు.

"ష్..." ఏదో డైరీలో రాసుకుంటూ అన్నాడు రామకృష్ణ

"అదికాదు..." ఏదో చెప్పబోయాడు వాసు.

"ఈ కొటేషన్ విను. టాగూర్‌ది:"

ఒళ్లు మండిపోయింది వాసుకు.

"ప్రాక్టికాల్టీలోకి రారా... ఆవిడకు..."

"ఏమైంది?" చటుక్కున లేచాడు, రామకృష్ణ

"ఆవిడకు కేన్సరుట... సెకండరీ స్టేజ్ దాకా పట్టించుకోలేదట... నాకు సంబంధం లేదు అని వదిలించుకుని వెళ్లిపోయాడు మొగుడు... ఆపరేషన్ చేయిస్తే బ్రతుకుతుందేమోనని పాపం, ఆ తల్లి గోల... మామూలు ట్రీట్‌మెంటుకే డబ్బులు లేవు వాళ్ల దగ్గర... నా దగ్గరున్నదేదో ఇచ్చి వద్దామనుకున్నాను కానీ..."

"నా దగ్గర బోలెడు డబ్బుంది... కానీ..." ఆగిపోయాడు రామకృష్ణ

"ఏమిటి, ఆవిడ రోగానికి డబ్బు సహాయం చేస్తారా?! పిచ్చా చాదస్తమా? పైగా దానికి వంతులు పడిపోతున్నారేమిటి?! ఆమెతో మనకేం సంబంధం అసలు?..."

డ్రెస్సింగ్ నుంచి వచ్చిన పట్టుచీరలు తెచ్చి పెట్టుకుంటూ అడిగింది జానకి.

"నేను వెళ్లి... ఆవిడను అలా చూడలేను... ప్లీజ్... నువ్వు వెళ్లి నా మాటగా చెప్పు... ఆపరేషన్ నేను చేయిస్తానని చెప్పు..."

ఆ సాయంత్రం వాసు ఇంటికి వచ్చి అన్నాడు రామకృష్ణ. అతని ముఖంలో భావాలను చూడటానికి భయం వేసి తలదించుకున్నాడు వాసు.

వాసు వెళ్లాడు.

సన్నగా నవ్వుతూనే తిరస్కరించింది ఆమె.

"బ్రతకడం అంత పెద్ద అవసరంలా లేదు వాసూ! అవతారం చాలిస్తే పోలా?..."

"ఎందుకని?! అలా అనకు... వాడు ఏడుస్తాడు... వాడికి... వాడికి నువ్వంటే ఎంత ఇష్టమో తెలుసా?" నిస్సహాయతతో కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి వాసుకు.

"తెలుసు..." జాలిగా అందామె.

"మరి తెలిసీ..."

"ఈ శిథిల గృహానికి ఇంకా దీపారాధనలేమిటి చెప్పు?...దా, అన్నం తిందువుగాని..."

"కనీసం... కనీసం వాడికి చెప్పు..." చేతిలో వక్కపలుకులు తెచ్చిపెడుతూ అన్నాడు వాసు.

"ఏమని?" సూటిగా చూస్తూ అన్నది.

"నీకు... నీకు వాడంటే ఇష్టమని..." చటుక్కున మాట అనేసి నాలుక కొరుక్కున్నాడు వాసు... ఏదో అనాలని, ఏదో చెప్పేశాడా?!

తులసికోటకు ఆనుకుని కూర్చుంది ఆమె. సందెదీపం వెలుతురులో తమాషాగా మెరుస్తున్నాయి ఆమె కళ్లు. బొడ్డుమల్లె సువాసన...

"మాట్లాడవేం?" ఏదో మొండితనం వచ్చింది అతనికి.

"హం!" నిర్లిప్తంగా నవ్వింది ఆమె... "సీత వేషం వెయ్యడానికి వచ్చి ద్రౌపది డైలాగులు మాట్లాడకూడదు వాసూ!... నాటకం రసాభాసమౌతుంది... ఈ పాత్ర పరిధి ఇంతే..." చీకట్లోకి చూస్తూ చెప్పింది.

"ఇది జీవితం. నాటకం కాదు..." కచ్చపడుతోంది అతనికి, ఏదో నిస్సహాయత.

"జీవితమే పెద్ద నాటకం – ఇంక ఆ విషయం మాట్లాడకు... జానకీ పిల్లలూ కులాసాగా ఉన్నారా? కొడుకు దోగాడుతున్నాడా?"

సమాధానాలు చెపుతున్నాడు వాసు...

రామకృష్ణ వచ్చిఉంటే బలవంతాన టాక్సీ మాట్లాడి తీసుకువెళ్ళి హాస్పిటల్ చేర్చేవాడా, ఏమో అసలు రాడే...

హక్కులు లేని, అర్థం చెప్పలేని బాంధవ్యాలు వాటిని మాటల్లో బిగించినకొద్దీ మాయ కప్పుకుని వేరే రూపాలు ఎత్తుతాయి.

* * *

ఆమె చనిపోయిన నెలరోజులకు...

"ఇక్కడే..." ఆమెను సమాధి చేసిన చోటు ఎవరో చూపించారు. అక్కడ మౌనంగా నిలబడ్డాడు రామకృష్ణ.. అతని ఊహల్లో-

అక్కడొక పాలరాతి మంటపం... చుట్టూ ఎఱ్ఱని రోజా మొక్కలు... సమాధిపై నిత్యం జలజలరాలే పారిజాతాలు... నిరంతరం వెలిగే సుగంధ పరిమళాలు... చుట్టూ కనుచూపు మేర బొండు మల్లెల తోట. ఆ సమాధి మందిరంలో నిశ్చింతగా నిద్రపోతున్న ఆమె...

కానీ... ఇదంతా ఊహే... నిజం చెయ్యలేదు అతను...

"నువ్వెవరు?" అని ప్రపంచం అడిగే ప్రశ్నకు సమాధానం లేదు అతని దగ్గర.

"నా సమాధి సమాధానం చెపుతుంది..." అన్న మహానుభావుల ఆశీర్వచనమేమో కానీ,

సన్నిధికి అర్థం తెలిసింది అతనికి...

ఇంతకాలం ఆమెతో తన సన్నిహితత్వం... దీనికి మృత్యువు అడ్డం కాదని అర్థమైంది.

ఆ తరవాత...

పౌర్ణమికి అతడు ఉపవాసమెందుకు ఉంటాడో, కార్తీక పౌర్ణమికి ఆ పల్లెటూరుకి ఎందుకు వెళతాడో అర్థం చేసుకోగలిగింది వాసు ఒక్కడే...

"మీరు బ్రతికేది జ్ఞాపకాలతో... మీ ఊహల్తో ఆవిడకు పవిత్రత అంటగట్టి, గ్లామరైజ్ చేసి బ్రతికేస్తున్నారు. ప్రాక్టికాలిటీ ఉండాలి దేనికైనా..." అప్పుడప్పుడు వంకరగా అంటుంది జానకి.

అతడు మామూలుగానే... ఏమీ మాట్లాడడు.

('వనిత' (ఉగాది సంచిక) - ఏప్రిల్, 1995)